సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



గోవులను రక్షించాలి

ప్రతి ఒక్కరూ గోవులను రక్షించాలని, గోరక్షణ హిందూ ధర్మరక్షణ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు.

- 8లో ▸



అలంకార ప్రాయం..

కొండూర్ ఎత్తిపోతల పథకం అలంకారప్రాయంగా మారింది. రెండు మోటార్లను దుండగులు ఎత్తుకెళ్లారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.9 /10.6

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచుకురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

సమయ పాలన పాటించాలి



నిజామాబాద్‌అర్బన్‌: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోని ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాలను అదనపు కలెక్టర్ ఎస్ కిరణ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్య, వైద్యారోగ్య, పౌర సరఫరాలు, సహకార, పరిశ్రమలు తదితర శాఖల కార్యాలయాల్లో అధికారుల, సిబ్బంది హాజరును పరిశీలించారు. సమయ పాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల

నిజామాబాద్ అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేసినట్లు డీఈవో అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 8వ తరగతికి వరకు రూ.1,88,90,679, అలాగే సీసీహెచ్‌ల గౌరవ వేతనం రూ.69,58,000 విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మండలాల వారీగా ఎంఈవోల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

బోర్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్ బోర్డు నిబంధనలను అతిక్రమిస్తే కళాశాలలపై చర్యలు తప్పవని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్ కళాశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను డాటాను సరిచూసుకునేందుకు, సబ్జెక్టులు మార్చుకునేందుకు, ఫొటో, సంతకం తప్పుదొర్లితే సరిదిద్దుకునే అవకాశాన్ని ఇంటర్ బోర్డు కల్పించిందని, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. తప్పిదాలు దొర్లితే విద్యార్థుల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కళాశాలల్లో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ సూచించిన మేరకు ప్రణాళికాబద్ధంగా బోధన, నిర్వహణ జరగాలని ఆదేశించారు.

నాణ్యమైన సోయా విత్తనాలు అందిస్తాం



వేల్పూర్‌: రాష్ట్ర రైతాంగానికి నాణ్యమైన సోయా విత్తనాలను అందిస్తామని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. వానాకాలం సీజన్‌లో అవసరమయ్యే లక్ష క్వింటాళ్ల విత్తనాల కోసం సీడ్ కార్పొరేషన్ అధికారులతో కలిసి బుధ, గురువారాల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అన్వేష్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతోపాటు విత్తనాభివృద్ధి సంస్థను మిగతా రాష్ట్రాల అనుబంధంతో దేశంలో ముందంజలో ఉంచేందుకు ఇండోర్, భోపాల్ ప్రాంతాలను సందర్శించామన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, అధికారులతో సమావేశమై సోయాబీన్ విత్తన ఆవశ్యకత, తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కు శనగ, జొన్న, సజ్జ విత్తనాల సరఫరాపై చర్చించామన్నారు. ఇండోర్‌లోని విత్తన శుద్ధి కర్మాగారాన్ని సందర్శించి విత్తన నాణ్యత, ప్యాకింగ్‌ను పరిశీలించినట్లు వెల్లడించారు.

రేపు హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ బాలుర విభాగంలో ఈ నెల 14న మాక్లూర్ మండలం కల్లెడ జెడ్పీ స్కూల్‌లో ఎంపికలు ఉంటాయని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగామోహన్ చక్రు, సురేందర్ గురువారం పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జనవరిలో హైదరాబాద్‌లో నిర్వహించే పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9642535535, 9440441757 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకం ద్వారా ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో ఆరు కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారు. ప్రతి రోజు సుమారు 1,70,528 మంది ప్రయాణించారు. మహాలక్ష్మి ద్వారా ఆర్టీసీకి రూ. 223.57 కోట్ల ఆదాయం రావడంతో నష్టాలలో ఉన్న సంస్థకు భరోసా లభించింది. పథకం ప్రవేశపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..



ఆర్టీసీకి మహాలక్ష్మి!

- ఉమ్మడి జిల్లాలో ఆరు డిపోలు.. 582 బస్సులు
- రోజుకు సుమారు 1,70,528 మంది రాకపోకలు
- ఉమ్మడి జిల్లాలో ఏడాదిలో 6 కోట్ల మంది మహిళల ప్రయాణం
- రూ.223.57 కోట్ల ఆదాయం

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచితంగా ప్రయాణించడానికి అవకాశం కల్పించింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆరు డిపోలు ఉండగా, 582 బస్సుల ద్వారా ఆర్టీసీ సంస్థ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోంది. వీటిలో పల్లె వెలుగు 317, ఎక్స్‌ప్రెస్‌లు 114 బస్సులు ఉన్నాయి. రాజధాని, సూపర్‌లగ్జరీ, ఎలక్ట్రిక్ బస్సులు కలిపి 151 ఉండగా వీటిని ఎక్కువగా హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు తిప్పుతున్నారు. ఇదిలా ఉండగా మహాలక్ష్మి పథకం ద్వారా 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు ఉమ్మడి జిల్లాలో 6 కోట్లకు పైగా మహిళలు ప్రయాణం చేశారు. ప్రతి రోజు ఈ పథకం ద్వారా సుమారు 1,70,528 మంది ప్రయాణం చేశారు. ఉమ్మడి జిల్లాలో 36 బస్టాండ్‌లు ఉన్నాయి. ఆర్టీసీ బస్సులలో గతంలో 68 శాతం ఆక్యుపెన్సీ ఉండగా మహాలక్ష్మి పథకం కారణంగా ఇప్పుడు 92 శాతం దాటింది.

కామారెడ్డి, బాన్సువాడ నుంచే అధికం

నిజామాబాద్ రీజియన్‌లోని ఆరు డిపోలలో ఎక్కువగా కామారెడ్డి, బాన్సువాడ డిపోల నుంచి మహిళలు ప్రయాణిస్తున్నారు. కామారెడ్డి డిపో నుంచి ఇప్పటి వరకు 1,69,73,712 మంది, బాన్సువాడ డిపో నుంచి 1,01,22,310 మంది ప్రయాణం చేశారు. వీకెండ్స్, హాలీడేస్, పండుగ సమయాల్లో బస్సుల్లో రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది. మిగతా రోజుల్లో సాధారణ ప్రయాణం ఉంటుంది. ట్రాన్స్‌జెండర్లు సైతం మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు.

లక్ష్యాన్ని మించి..

ఉమ్మడి జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరుతోంది. గతంలో నష్టాలలో ఉన్న ఆర్టీసీ డిపోలు ఇప్పుడు లక్ష్యాన్ని మించి లాభాల బాటలో పయనిస్తున్నట్లు ఆర్టీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్కో డిపోకు ప్రతి రోజు సుమారు రూ. 9.68 లక్షల నుంచి రూ.15.75 లక్షల ఆదాయం వస్తుండగా, మొత్తం ఆరు డిపోల ద్వారా సమారు రూ.63.52 లక్షల ఆదాయం సమకూరుతోంది. ఇప్పటి వరకు ఆర్టీసీకి రూ.223.57 కోట్ల ఆదాయం వచ్చింది.

2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు..

డిపో	ప్రయాణికులు	ఆదాయం (రూ.కోట్లలో)
ఆర్మూర్	89,32,976	34.08
బోధన్	91,19,707	33.37
నిజామాబాద్-1	85,73,065	30.62
నిజామాబాద్-2	63,04,600	32.61
బాన్సువాడ	1,01,22,310	37.45
కామారెడ్డి	1,69,73,712	55.44

మంత్రి రివ్యూపై ఆశలు



కోతకు గురైన కాకతీయ కాలువ లైనింగ్

- సమస్యల వలయంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్
- అధ్వానంగా మారిన కాలువల లైనింగ్
- నేడు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాక
- అధికారులతో సమీక్ష సమావేశం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువల లైనింగ్ దెబ్బతినగా, పలు చోట్ల తూముల పరిస్థితి అధ్వానంగా మారింది. కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువల లైనింగ్ మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎస్సారెస్పీకి శుక్రవారం రానుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉదయం 11.45 గంటలకు ఎస్సారెస్పీకి చేరుకోనున్న మంత్రి ప్రాజెక్టును సందర్శించిన అనంతరం సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.45 గంటల వరకు రివ్యూ కొనసాగనుంది. మంత్రి నిర్వహించనున్న సమీక్షపై ఆయకట్టు రైతులు ఎన్నో ఆశలతో ఉన్నారు. ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించే దిశగా మంత్రి సమీక్ష చేపట్టాలని కోరుతున్నారు.

పడిపోయిన నీటి నిల్వ సామర్థ్యం

ప్రధానంగా పూడిక కారణంగా ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం రోజురోజుకూ తగ్గిపోతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు పడిపోయింది. 112 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టను నిర్మించారు. అయితే ఎగువ ప్రాంతాల నుంచి ప్రతి ఏడాది వరదతోపాటు 0.8 టీఎంసీల పూడిక వస్తోంది. దీంతో ప్రాజెక్టులో భారీగా పూడిక నిండుతోంది. పూడిక తొలిగించే దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భవిష్యత్‌లో ఆయకట్టు పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయకట్టు స్థిరీకరణ చేపట్టకపోవడం ఇబ్బందిగా మారింది.

అంధకారం

ఎస్సారెస్పీ చెంతనే విద్యుదుత్పత్తి అవుతున్నా డ్యాం పరిసరాలు మాత్రం అంధకారంలో మగ్గుతున్నాయి. ఆనకట్టపై ఉన్న లైట్లు ఒక్కటి కూడా వెలగడం లేదు. లైట్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. ప్రాజెక్ట్ ఆనకట్టపై పిచ్చి మొక్కలను తొలిగించేందుకు శాశ్వతమైన పరిష్కరం ఇప్పటికీ చూపించలేదు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే సమస్యలెన్నో ఉన్నాయి. జాతీయ రహదారి 44 నుంచి ప్రాజెక్ట్ వరకు ఉన్న రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ పని చేయడం లేదు. ప్రాజెక్ట్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. పర్యాటకంగా ఎస్సారెస్పీ అభివృద్ధి చెందుతుందనే ఆశలు కలగానే మిగిలాయి.

నేడు నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్: యాసంగి పంటల సాగు అవసరాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను ప్రారంభించడానికి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం రానున్నారు. ఉదయం 10 గంటలకు గోర్గల్ గేటు వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్ల వద్దకు వెళ్తారు. నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు హెడ్‌స్లూయిస్ వద్ద మంత్రి పర్యటన ఏర్పాట్లను నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్, ఈఈ సోలోమాన్ పర్యవేక్షించారు.

13 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు

- నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ కోర్టుల్లో ఏర్పాట్లు
- రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



ఖలీల్‌వాడి: రాజీపడదగిన క్రిమినల్, సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల కోరారు. జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో న్యాయమూర్తి గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 14న లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ కోర్టుల్లో 13 బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెక్ బౌన్స్, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల బ్యాంకుల రుణాలకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలకు ఆర్థికలబ్ధి చేకూరుతుందన్నారు. అలాగే గృహహింస, మెయింటెనెన్స్ కేసులు రాజీ చేసుకోచ్చని తెలిపారు. కక్షిదారుల మధ్య నెలకొన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే నూతన పరిష్కార వేదిక అత్యుత్తమమని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న అని రకాల కేసులకు శాశ్వత చట్టబద్ధత కలిపిస్తూ అవార్డులు జారీ చేస్తామని, పై కోర్టుల్లో అప్పీలుకు వీలు ఉండదని తెలిపారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పౌరసమాజం సహాయసహకారాలు అందించాలని కోరారు.

సర్వేలో తప్పిదాలకు తావివ్వొద్దు

- అర్హులకు లబ్ధి చేకూర్చాలి
- శిథిలావస్థలోని ఇళ్లలో ఉంటున్న వారి వివరాలనూ సేకరించాలి
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశం



ఇస్సాపల్లిలో దరఖాస్తుదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

పెర్కిట్(ఆర్మూర్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పిదాలకు తావివ్వొద్దని, అర్హులకు లబ్ధి చేకూరేలా యాప్‌లో వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్, ఇస్సాపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే, యాప్‌లో వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన, పురాతన ఇళ్లలో నివాసముంటున్న వారు కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు వస్తే వారి వివరాలను సైతం యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. ఒక్కో దరఖాస్తుదారుని వివరాలను నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది, రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారు, సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఎదురువుతున్నాయని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమంది వివరాలు సేకరించారు, ఆన్‌లైన్‌లో ఎన్ని అప్‌లోడ్ చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానంద్, ఎంపీడీవో సాయిరాం, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంపీవో శ్రీనివాస్ తదితరులున్నారు.

రిజిస్ట్రేషన్ల నిబంధనలకు పాతర

- విద్యుత్ బిల్లులు, ఇంటి పన్ను రశీదులతో డాక్యుమెంట్లు
- సర్క్యులర్ 257ని నీరుగారుస్తున్న సబ్ రిజిస్ట్రార్లు
- అందినకాడికి దండుకుంటున్న వైనం!
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

సుభాష్‌నగర్: రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన 257 సర్క్యులర్‌ను సబ్ రిజిస్ట్రార్లు తుంగలో తొక్కుతున్నారు. నిబంధనలకు పాతర వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్ను రశీదులతో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ముఖ్యంగా నిజామాబాద్ అర్బన్‌లో డబ్బులు ఇవ్వనిదే పని కావడంలేదని, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ చేయి తడపనిదే డాక్యుమెంట్ చేయడం లేదని డాక్యుమెంట్ రైటర్లు వాపోతున్నారు.

జిల్లాలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్, అర్బన్‌లో ఒక సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నారు. ఇటీవల బోధన్ మినహా నాలుగు చోట్ల సబ్ రిజిస్ట్రార్ల పనితీరుపై డాక్యుమెంట్ రైటర్లు నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. నిజామాబాద్ అర్బన్‌లో 9 రోజులపాటు దుకాణాలు మూసి ఉంచారు. ఇదే క్రమంలో సదరు సబ్ రిజిస్ట్రార్ శ్రీరామరాజు సెలవులో వెళ్లడంతో డీఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.



నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు

నిజామాబాద్ అర్బన్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ చేయి తడపనిదే పనులు కావడం లేదని డాక్యుమెంట్ రైటర్లు వాపోతున్నారు. డాక్యుమెంట్ రైటర్లు తొమ్మిది రోజులపాటు నిరసన తెలపడంతో సబ్ రిజిస్ట్రార్ సెలవులో వెళ్లిన సంగతి తెలిసిందే. ఇన్‌చార్జి రాకతో డాక్యుమెంట్ రైటర్లు వెంటనే తమ కార్యాలయాలు తెరిచి రిజిస్ట్రేషన్లు యథావిధిగా చేయిస్తున్నారు. వారం రోజుల సెలవుపై వెళ్లిన సబ్ రిజిస్ట్రార్ శ్రీరామరాజు తన సెలవును పొడిగించుకుంటూ వెళ్తుండడంతో ఆయన విధుల్లో చేరుతారా? లేదా? అనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు పూర్తిస్థాయి సబ్‌రిజిస్ట్రార్ తిరిగి విధుల్లో చేరడాన్ని ఇష్టపడడం లేదు. పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్ తిరిగి వస్తే తమకు అనుకూలమైన పనులు జరగవని ఉన్నతాధికారులపై పరోక్షంగా ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

నిబంధనలు బేఖాతర్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఇంటి అనుమతులు లేని, నాన్ లే అవుట్ ప్లాట్లు, ఒక ప్లాట్‌ను విభజించి రిజిస్ట్రేషన్ చేయొద్దని గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020, ఆగస్టులో సర్క్యులర్ 257 తీసుకొచ్చింది. ప్రస్తుత రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ, ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలను పాటించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ పలువురు సబ్ రిజిస్ట్రార్లు వాటిని బేఖాతర్ చేస్తూ కేవలం ఇంటి పన్ను, విద్యుత్ బిల్లుల రశీదులతో డాక్యుమెంట్లు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నిజామాబాద్ అర్బన్: ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన బాపూజీ వచనాలయాన్ని డి జిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమ ని వచనలయ అధ్యక్షులు గడ్డం భక్తవత్సలం అన్నారు. నూతన కమిటీ సభ్యులు గురువా రం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా భక్తవత్సలం మాట్లాడుతూ.. బాపూ జీ వచనాలయం పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు వేదికగా ఉంటూ వారిని ఉత్తములుగా తీర్చిదిద్దుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో



కార్యదర్శి మీసాల సుధాకర్‌రావు, కోశాధికారి బి గంగాధర్‌రావు, ఉపాధ్యక్షులు భవంతి దేవీదాస్, బోగ అశోక్, సంయుక్త కార్యదర్శులు సాంబయ్య, దత్తాత్రి, కార్యవర్గ సభ్యులుగా లక్కంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31లోగా ధాన్యం డబ్బులు చెల్లించాలి

- రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ శశిధర్ రాజ్



మాట్లాడుతున్న శశిధర్ రాజ్

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం 2022–23 యాసంగిలో నిర్వహించిన టెండర్ ధాన్యం డబ్బులను రైస్ మిల్లర్లు ఈనెల 31వ తేదీలోపు చెల్లించాలని రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ శశిధర్ రాజ్ ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టెండర్ ధాన్యానికి సంబంధించిన రైస్‌మిల్లర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 2022–23 సంవత్సరం యాసంగి ధాన్యానికి టెండర్ నిర్వహించిందని అన్నారు. లాట్ నంబర్ 1, 2, 12కు సంబంధించి రైస్‌మిల్లర్లు ప్యాడీ డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈనెల 31 లోపు డబ్బులు చెల్లించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నగర శివారులోని కాలూరు, ఖానాపూర్‌లో ఉన్న పలు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న ధాన్యం వివరాలు, సీఎంఆర్ రికార్డులను పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. సీఎంఆర్ సకాలంలో చెల్లించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, డీఎం అంబదాస్ రాజేశ్వర్, ఏసీఎస్‌వో రవి రాథోడ్, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహారాష్ట్ర పర్యటనకు పసుపు రైతులు



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌లో ఏర్పాటు చేసిన కేపీఎం పసుపు ఉత్పత్తిదారుల సంఘం రైతులు నాసిక్ సందర్శనకు బయలుదేరి వెళ్లారు. గురువారం మనోహరాబాద్‌లో మండల వ్యవసాయ అధికారిణి దేవిక జెండా ఊపి నాసిక్ సందర్శన యాత్రను ప్రారంభించారు. వీరు మహారాష్ట్రలోని హింగోళి వద్ద దత్తగురు రైతు ఉత్పత్తిదారుల సంఘం, నాసిక్‌లోని సైయాద్రి రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించనున్నారు. అక్కడ రైతు ఉత్పత్తిదారుల సంఘాల నిర్మాణం, బలోపేతం, వారు నిర్వహిస్తున్న కార్యకలాపాలు తెలుసుకోవడానికి వెళ్లినట్లు సంఘం డైరెక్టర్ పాటుకురి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. మనోహరాబాద్, కలిగోట్, పడకల్, జక్రాన్‌పల్లి, మైలారం గ్రామాల్లోని 45 మంది రైతులు సందర్శనకు వెళ్లారు. సందర్శనకు వెళ్లిన వారిలో సంఘం డైరెక్టర్లు అల్లూరి సంతోష్, వెల్మ సంతోష్, గడ్డం శ్రీనివాస్, భోజన్న, నాగేశ్, రాజు, గడ్డం లక్‌పతిరెడ్డి, రైతులు ఉన్నారు.

డబ్బుల బ్యాగ్ బాధితురాలికి అందజేత



రుద్రూర్: బస్సులో డబ్బులతో ఉన్న బ్యాగును బాధితురాలు మరిచిపోయి పోలీసులను ఆశ్రయించగా, ఆ బస్సును వెంబడించి రూ. 40 వేల నగదు, బంగారాన్ని బాధితురాలికి అప్పగించిన ఘటన రుద్రూర్‌లో గురువారం జరిగింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండలం కారేగాం గ్రామానికి చెందిన నరహరి లలిత అనే మహిళ బాన్సువాడ నుంచి బస్సులో వచ్చి రుద్రూర్ దిగింది. డబ్బులు ఉన్న బ్యాగు కనపడక పోవడంతో బస్టాండ్ పరిసరాల్లో ఉన్న పోలీసులను ఆశ్రయించింది. వారు వెంటనే బస్సును వెంబడించి బోధన్‌లో ఆపి తనిఖీ చేశారు. బ్యాగు దొరకడంతో రుద్రూర్ పీఎస్‌లో బాధితురాలికి అప్పగించారు. బాధితురాలు సమస్యను చెప్పగానే వెంటనే స్పందించిన హెడ్ కానిస్టేబుల్ సురేశ్, పోలీస్ కానిస్టేబుల్ గజేందర్, డ్రైవర్ శ్రీనివాస్‌ను ఎస్సై అభినందించారు.

విద్యార్థి తల్లిదండ్రుల ఆందోళన

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని దుబ్బ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థినిని టీచర్ కొట్టడంతో తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేశారు. వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అశ్విత ఈ నెల 7న పాఠశాల నుంచి గంట ముందుగా ఇంటికి వెళ్లింది. దీంతో మరుసటి రోజు అలా ఎందుకు వెళ్లావంటు గణితం టీచర్ విద్యార్థిని చేతిపై తీవ్రంగా కొట్టింది. దీంతో జరిగిన విషయాన్ని ఇంటికి వచ్చాక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు మరుసటి రోజు పాఠశాలకు వచ్చి టీచర్‌తో వాగ్వాదానికి దిగారు. గురువారం మళ్లీ సదరు విద్యార్థిని చేతిపై తీవ్రంగా టీచర్ కొట్టడంతో చేతి విరిగిందని తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి వాగ్వాదానికి దిగారు. ఘటన జరిగిన మొదటి రోజే ఎంఈవో వెంకటనారాయణగౌడ్ విచారణ చేపట్టారు. విద్యార్థినిపై టీచర్ తీవ్రంగా కొట్టినట్లు ఆధారాలు లేవని తెలిసింది. ఈ ఘటనపై మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇద్దరు విచారణ చేపట్టారు. మూడో టౌన్‌లో ఈ ఘటనపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. కా గా పాఠశాల గణితం టీచర్‌ను వివరణ కోరగా విద్యార్థినిని తీవ్రంగా కొట్టలేదని తెలిపారు.

స్థల పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): అదనపు కలెక్టర్ విక్టర్ గురువారం మండలంలో పర్యటించారు. జువ్వాడి శివారులో నిర్మించ తలపెట్టిన స్టేడియం స్థలాన్ని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. రికార్డులు, స్టేడియం నిర్మించే స్థల విస్తీర్ణం రికార్డులో పక్కాగా పొందుపర్చాలని సూచించారు. అనంతరం జువ్వాడి గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో రాజేశ్వర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అలంకార ప్రాయంగా 'ఎత్తిపోతలు'

- రూ. కోట్ల నిధులతో చేపట్టిన పథకాలు నిరుపయోగం
- మరమ్మతులు చేయించాలంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



కొండూర్ ఎత్తిపోతల మోటర్ల గది

నిజామాబాద్ రూరల్: రూ. కోట్లు నిధులు వెచ్చించి రైతుల పంటలకు సకాలంలో సాగునీరు అందించేలా ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి మరమ్మతులతో పథకాలు నిరుపయోగంగా మారాయి. కొండూర్ శివారులో రెండు పంటలకు పుష్కలంగా నీరందించేందుకు ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం రైతులకు అందని ద్రాక్షలా మారింది. రూ. 1.95 కోట్లు ఖర్చు చేసి ఫులాంగ్ వాగు కొండూర్ శివారులోని వాగుపై ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టారు. 2018లో రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్(ఆర్ఐడీఎఫ్) నిధులతో దీనిని నిర్మించారు. నిర్వహణ లోపం, ప్రభుత్వ అధికారులు పట్టించుకోక ప్రారంభించిన రెండేళ్లకే మూత పడింది. దీంతో రైతులు, ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలకు నీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

చోరీకి గురైన యంత్రాలు

కొండూర్ శివారులో ఉన్న ఎత్తిపోతల పథకం పూర్తిగా పాడవడంతో అందులో ఉన్న మూడు మోటర్ల నుంచి రెండు మోటర్లను గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసై అధికారుల పర్యవేక్షణ లేమితో ఎత్తిపోతల పథకం కాస్తా మూలన పడింది.

ప్రజాధనం దుర్వినియోగం

కొండూర్ ఎత్తిపోతల పథకంపై పూర్తిగా అధికారుల నిర్లక్షంతో మూలన పడిందని రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి, కొండూర్, అశోక్ ఫారం గ్రామస్తులు పేర్కొంటున్నారు. రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన లిఫ్టులు, పంపులు దొంగతనానికి గురికావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, దీనిపై ప్రజాప్రతినిధులు స్పందిచాలని రైతులు కోరుతున్నారు.

410 ఎకరాల ఆయకట్టు

కొండూర్ ఎత్తిపోతల ద్వారా మండలంలోని తిర్మన్‌పల్లి, కొండూర్, అశోక్‌ఫారం గ్రామాల్లో 410 ఎకరాలకు నీరు అందుతుంది. ప్రభుత్వ పర్యవేక్షణ అనంతరం గ్రామ కమిటీకి లిఫ్ట్ బాధ్యతలు అప్పగించారు. కానీ వాటి నిర్వహణకు వారు సరిగా పట్టించుకోలేదు. చెక్‌డ్యాంల నిర్మాణం, నిజాంసాగర్ నీరు సంబంధిత గ్రామాలకు రావడంతో లిఫ్ట్‌ను పట్టించుకోలేదు. దీంతో పాటు లిఫ్ట్‌ను గ్రామస్తులు విస్మరించారు. అధికారులు లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించకుండా అలాగే వదిలేయడంతో ఎత్తిపోతల పథకం కింద ఉన్న కొండూర్‌లో ఉన్న రెండు యంత్రాలు మొరాయించి మూలన పడ్డాయి. ప్రస్తుతం నిజాంసాగర్ కెనాల్‌పై ఆధారపడిన రైతులు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా మరిచిపోయారు.

ఎత్తిపోతలను పున:ప్రారంభించాలి

రూ. కోట్లు ఖర్చు చేసి కొండూర్‌లో నిర్మించిన ఎత్తిపోతల పథకం పాడైపోయింది. ప్రస్తుతం నిజాంసాగర్ కెనాల్ వచ్చేంత వరకు ఎదురు చుడాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొండూర్ ఎత్తిపోతలను పున:ప్రారంభించి రైతుల సమస్యలను పరిష్కరించాలి.

– సుదర్శన్, రైతు, తిర్మన్‌పల్లి

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

వైస్ చాన్స్‌లర్ టి యాదగిరి రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరి

మోపాల్(తెయూ): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేయాలనే సంకల్పంతో ఉందని తెయూ వైస్ చాన్స్‌లర్ టి యాదగిరిరావు అన్నారు. తెయూ మైదానంలో గురువారం ఇంటర్ కాలేజ్ వాలీబాల్ మెన్ – ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలను రిజిస్ట్రార్ ఎం యాదగిరితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తెలంగాణ విశ్వవిద్యాలయం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకు అన్నిరకాల సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి మాట్లాడుతూ.. విద్యతో సమానంగా క్రీడలను నిర్వహిస్తున్నామని, క్రీడలతో క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 13 కళాశాలల నుంచి పురుషులు, 11 కళాశాలల నుంచి మహిళా క్రీడాకారులు సుమారు 150 మంది పాల్గొన్నారని తెలిపారు. వాలీబాల్ పురుషుల విజేతగా తెయూ, రన్నర్‌గా నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల నిలిచింది. మహిళల విభాగంలో విజేతగా నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల, రన్నర్‌గా ఆర్మూర్‌లోని టీజీడబ్ల్యూఆర్డీసీ నిలిచింది. విజేతలకు డైరెక్టర్ డాక్టర్ జి బాలకృష్ణ మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్రట్ బీఆర్ నేత, పీడీలు డాక్టర్ బాలమణి, రమ, రూప, అంజలి, అనిల్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులపై దృష్టి కేంద్రీకరించాలి



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న వీసీ యాదగిరి రావు, అధికారులు

మోపాల్(తెయూ): విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేపట్టి ఉపాధి కోర్సులపై దృష్టి కేంద్రీకరించాలని తెయూ వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు సూచించారు. డిచ్‌పల్లి మండలంలోని తెయూలో జంతుశాస్త్ర విభాగం విద్యార్థులకు సెరికల్చర్, కేంద్రీయ పట్టు పరిశ్రమ బోర్డు ఆధ్వర్యంలో మూడుఎ రోజుల పాటు ఇచ్చిన హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్ గురువారంతో ముగిసింది. శిక్షణలో విద్యార్థులకు మల్బరీ కల్చర్, పట్టు రోలింగ్ విధానం, చాకి గుడ్ల ఉత్పత్తి కేంద్రం నిర్వహణ, గుడ్ల ఉత్పత్తి విధానం, పోలింగ్ విధానంలో ఆధునిక యంత్రాల నిర్వహణపై క్షేత్రస్థాయి అనుభవాలు, మార్కెటింగ్ పద్ధతులను వివరించారు. నేషనల్ సిల్క్ బోర్డు సైంటిస్ట్ డాక్టర్ వినోద్ యాదవ్, టెక్నికల్ ఆఫీసర్ రాఘవేంద్ర, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సెరికల్చర్ ఆఫీసర్ ఐలయ్య, రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను వీసీ అందజేశారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నశీల, ప్రొఫెసర్లు సునీల్ కుమార్, విజయ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గోవులను రక్షించాలి



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ రూరల్: ప్రతిఒక్కరూ గోవులను రక్షించాలని, వాటిని రక్షితే హిందూ ధర్మాన్ని రక్షించడమే అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గోరక్ష మహాపాదయాత్రలో భాగంగా గురువారం నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం నుంచి ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం వరకు గోమాతతో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర గోరక్షణ సంఘ సభ్యులు బాలకృష్ణ గురుస్వామి గోరక్ష మహాపాదయాత్రలో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 77రోజుల పాటు 9రాష్ట్రాలు కలుపుకుంటు 2500వందల కిలోమీటర్ల పాదయాత్ర చేశారన్నారు. దేశంలో హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలంటే ముందుగా గోవులను రక్షించి వాటిని సంరక్షించాలన్నారు. హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు హరిదాసు స్వామిజీ, ధాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

130 కిలోల పటిక, బెల్లం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం సంచులు

కామారెడ్డి క్రైం: రైలులో అక్రమంగా తరలిస్తున్న 130 కిలోల పటిక, బెల్లంను కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్, ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మధ్యాహ్నం దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు కామారెడ్డికి చేరుకోగానే తనిఖీలు చేపట్టారు. 100 కిలోల బెల్లం, 30 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్నది ఎవరనేది తెలియలేదు. కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ తెలిపారు.

డ్రైవర్ తప్పిదం.. ప్రయాణికుల ఆగ్రహం



భిక్కనూరు: ఆర్టీసీ డ్రైవర్ తప్పిదం కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలో డీజిల్ లేక ఆర్టీసీ బస్సు ఒకటి నిలిచిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు..బోధన్ డిపో ఆర్టీసీ బస్సు సికింద్రాబాద్ వెళ్తుండగా భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ బస్సును స్టార్ట్ చేసేందుకు యత్నించినా స్టార్ట్ కాలేదు. దీంతో ప్రయాణికులు కొందరూ డీజిల్ ఉందా లేదా చూడమని డ్రైవర్‌కు సూచించడంతో ఆయన డీజిల్ ట్యాంక్‌ను చెక్ చేశారు. అందులో డీజిల్ లేకపోవడంతో ప్రయాణికులు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజిల్ లేకుండా బస్సును ఎలా రోడ్డుపై తెచ్చారని కోపడ్డారు. విషయం తెలిసి జీఎంఆర్ సంస్థకు చెందిన నేషనల్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది డీజిల్ తీసుకొచ్చి ట్యాంక్‌లో పోయడంతో బస్సు స్టార్ట్ అయ్యింది. వెంటనే సికింద్రాబాద్ పయనమయ్యారు.

ఆర్మూర్‌లో చైన్ స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లి సమీపంలో గురువారం రాత్రి స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని దొంగలు బంగారు గొలుసును ఘటన చోటు చేసుకుంది. పెర్కిట్‌లోని తిరుమల కాలనీకి చెందిన సింగారం లలిత కొడుకుతో కలిసి అర్గుల్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో మామిడిపల్లి సమీపంలో దుండగులు పల్సర్ బైక్‌పై వెనుక నుంచి మెడలో బంగారు గొలుసు దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పేర్కొన్నారు.

లాటరీ పేరుతో ఘరానా మోసం

భిక్కనూరు: లాటరీ పేరుతో ఓ వ్యక్తి మోసపోయినట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బస్వాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు. ఫోన్‌లో ఈ నెల 4న ఫేస్‌బుక్ చూస్తుండగా లాటరీ అని కనిపించడంతో దానిని క్లిక్ చేశాడు. ఆయనకు వాట్సప్ కాల్ చేసి మీకు రూ. 60 లక్షలు, 10 తులాల బంగారం, ఒక ఐఫోన్ లాటరీ తగిలిందని నమ్మించారు. ఇందుకు గాను ట్యాక్స్‌ల రూపంలో డబ్బులు చెల్లించాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యక్తి ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పలు బ్యాంకుల ద్వారా సైబర్ నేరగాళ్లు పంపిన అకౌంట్ నంబర్లకు రూ. 7,20,100 నగదును చెల్లించాడు. తిరిగి వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి: మండల కేంద్రంలో సైబర్ మోసం జరిగినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం భవానీపేటకు చెందిన మహేశ్ అనే యువకుడి సెల్‌ఫోన్‌కు ఈ 10న మహిళ పేరుతో హాయ్ అని మెసేజ్ వచ్చింది. దీంతో సదరు యువకుడు మళ్లీ హాయ్ అని బదులిచ్చాడు. కొద్ది సేపు చాటింగ్ చేసిన తర్వాత ఓ లింక్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేస్తే స్టార్ హోటల్లో గదులు ఉచితంగా ఇప్పిస్తామని చెప్పడంతో సదరు యువకుడు లింక్ ఓపెన్ చేయగానే తన ఖాతాలో ఉన్న రూ. 52 వేలు ఖాళీ అయ్యాయి. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడ్డ యువకులు

రెంజల్: మండలంలోని వీరన్నగుట్ట శివారులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మండలంలోని కందకుర్తి నుంచి మద్యం మత్తులో వస్తున్న కృష్ణను వీరన్నగుట్ట గ్రామానికి చెందిన సంతోష్ అనే యువకుడు నిజామాబాద్ నుంచి తిరిగి వస్తుండగా ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి రెండు కాళ్లు విరిగాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సకాలంలో చేరుకున్న సిబ్బంది ఈఎంటీ సంజీవ్‌గౌడ్, ఈఆర్‌సీపీ డాక్టర్ శివ ప్రథమ చికిత్సలు అందించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది పేర్కొన్నారు. ఈ విషయమై రెంజల్ ఎస్సైని వివరణ కోరగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి జరిమానా

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఓపెన్ ఎస్సెస్సీ తెలుగు పరీక్షలో ఒకరి పరీక్షకు మరొకరు పరీక్ష రాసి పట్టుబడిన కేసులో ఇద్దరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. 2017లో ఆర్మూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఓపెన్ ఎస్సెస్సీ తెలుగు పరీక్ష రాయాల్సిన ఎండీ ఫయిజుద్దీన్ అతనికి బదులు ఎండీ ముమిత్ తెలుగు పరీక్ష రాస్తూ ఇన్విజిలేటర్‌కు పట్టుబడ్డాడు. దీంతో పరీక్ష సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్ స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఇరువురిపై చీటింగ్ కేసు నమోదైంది. విచారణలో చీటింగ్ చేసినట్లు రుజువు కావడంతో రూ. 10వేల చొప్పున ఇరువురికి జడ్జి జరిమానా విధించారని ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం

రుద్రూర్: పోతంగల్ సమీపంలో ఉన్న మంజీరా నదిలో ఇసుకను అక్రమంగా తవ్వకాలు చేసి క్వారీకి వెళ్లే దారిలో నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు పోతంగల్ తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు. ఇసుక డంప్ 20 ట్రాక్టర్ ట్రిప్పుల వరకు ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక డంప్ చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి, యాజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్ పట్టివేత..

నవీపేట: మండలంలోని జన్నెపల్లి వాగు నుంచి ఇసుకను గురువారం అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను తహస్సీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిలో ముగ్గురిని అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారైనట్లు ఎస్సై సాయన్న గురువారం పేర్కొన్నారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేశామని వీరి నుంచి రూ. 6 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బుధవారం రాత్రి, గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు..



నవీన్ కుమార్(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొన్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని శాబ్దిపూర్ బైపాస్ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన వడ్ల బాలవ్వ, నర్సింలుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు నవీన్‌కుమార్(25) కామారెడ్డిలోని ఓ కార్పెంటర్ దుకాణంలో దినసరి కూలీగా పనులు చేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి పనులు ముగించుకుని 10 గంటల ప్రాంతంలో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా శాబ్దిపూర్ బైపాస్ ప్రాంతంలో రోడ్డుపై నిర్లక్ష్యంగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను నవీన్‌కుమార్ వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ హోంగార్డు..



బాలయ్య మృతదేహం(ఫైల్)

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ మాజీ హోంగార్డు మృతి చెందాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన చెవిటోళ్ల బాలయ్య (70) గతంలో హోంగార్డుగా పని చేసి రిటైర్ అయ్యాడు. కామారెడ్డికి వచ్చిన అతడు బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతుండగా అటుగా వెళ్తున్న ఓ క్రేన్ వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

మూర్ఛతో గేదెల కాపరి ..



నారాయణ మృతదేహం

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లికి చెందిన గేదెల కాపరి తోకల నారాయణ(39) మూర్ఛతో మృతిచెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ గేదెలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారి పనిలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు గ్రామ శివారుకు గేదెలను తీసుకెళ్లాడు. అతను కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. గేదెలను మోపడానికి వెళ్లిన నారాయణ లంబాడి సర్దార్ వ్యవసాయ భూమిలోని నీటి మడిలో మూర్ఛవ్యాధితో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు నారాయణ కోసం వెతుకుతుండగా, గురువారం ఉదయం నీటి మడిలో పడి మృతిచెంది ఉన్నాడు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి గుర్తు తెలియని వ్యక్తి..

బోధన్‌టౌన్: పట్టణ శివారులోని పసుపువాగులో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందాడు. గురువారం పసుపు వాగులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతిడి వయస్సు 30 ఏళ్ల వరకు ఉంటుందని, సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంట్‌తో పాటు గోదుమ కలర్ షర్టు, గ్రీన్ కలర్ బనియన్ ధరించి ఉన్నాడని అన్నారు. ఆచూకి తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు.

చెరువులో పడి..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన బండి గంగారాం(60) ప్రమాదవశాత్తు పెద్ద చెరువులో పడి మృతి చెందాడు. జక్రాన్‌పల్లికి చెందిన బండి గంగారాం పని నిమిత్తం పడకల్ తండాకు వెళ్లి సైకిల్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో చెరువు వద్ద కాలకృత్యాలకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. నీటిలో ట్రాక్టర్ టైర్లతో కూడిన గుంత ఉంది. దీంతో నీటిలో పడగానే ఊపిరాడక మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య భారతి, కుమార్తె సౌమ్య ఉన్నారు.

కారు బోల్తా.. డ్రైవర్ మృతి



ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారు బోల్తా పడిన ఘటనలో వనపర్తికి చెందిన కారు డ్రైవర్ ప్రకాశ్(18) మృతి చెందాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన మద్దెల చందు ఆర్మూర్ మండలం కోటార్మూర్‌కు చెందిన స్నేహితుడు అక్షయ్ మరదలి వివాహం భీంగల్‌లో ఉండగా హైదరాబాద్ నుంచి కారు అద్దెకు తీసుకొని బుధవారం వివాహానికి వచ్చారు. భీంగల్ నుంచి పెర్కిట్‌లోని అక్షయ్ ఇంటికి చేరుకోగా అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో డ్రైవర్ ప్రకాశ్‌తో పాటు మరో ఆరుగురు టీ తాగేందుకు బయలు దేరగా కాంతి స్కూల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రకాశ్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశ్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ..



సంగ్యానాయక్, లక్ష్మీబాయి (ఫైల్)

నిజాంసాగర్: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం కిష్టాపూర్ శివారులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇస్లావత్ సంగ్యానాయక్(55), ఇస్లావత్ లక్ష్మీబాయి(48) భార్యాభర్తలు అక్కడిక్కడే మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. నిజాంసాగర్ మండలం మల్లూర్ తండాకు చెందిన ఇస్లావత్ సంగ్యానాయక్, లక్ష్మీబాయి దంపతులు. వీరు సంగారెడ్డి జిల్లాలోని అనకాపల్లిలో ఉన్న తమ కుమార్తె ఇంటికి ఎక్స్ఎల్ మోపెడ్‌పై బయలు దేరారు. కల్హేర్ మండలం కిష్టాపూర్ శివారులో వీరి వాహనాన్ని తారు వాహనం బలంగా ఢీకొన్నది. ఈ ఘటనలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దంపతుల మృతితో తండాలో విషాద చాయలు అలుముకున్నాయి.